క్లుప్తంగా

రైతుబజార్‌లో తనిఖీలు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద ఉన్న రైతుబజార్‌ను మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్లు పోతబత్తుల శ్రీనివాస్, జగదీశ్వరి, రామ్‌బాయి గురువారం తనిఖీలు చేశారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్‌తో తొలుత సమావేశమై.. అక్కడ స్టాళ్లు నిర్వహిస్తున్న రైతుల వివరాలను తెలుసుకున్నారు. కొనుగోలుదారుల పట్ల రైతులు ఎలా వ్యవహరిస్తున్నారు? ప్రభుత్వ అధికారులు సూచించిన ధరలకే విక్రయాలు సాగిస్తున్నారా లేదా అన్న దానిపై ఆరా తీశారు.

చెత్త డంపింగ్‌తో ప్రజల ఇబ్బందులు



మాజీ సైనిక కాలనీ సేవా మార్గం వద్ద డంప్ చేసిన చెత్త

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు మాజీ సైనిక కాలనీ వద్ద గల అంబేడ్కర్ మైదానానికి ఆనుకుని ఉన్న సేవా మార్గంలో నిర్లక్ష్యంగా చెత్తను డంప్ చేస్తున్నారు. ఈ చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆ మార్గంలో పాదచారులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశ్రమలో భద్రతపై అవగాహన



హార్ట్ రెస్పిరేటరీ ద్వారా ప్రథమ చికిత్స ఏ విధంగా అందించాలనే విషయాన్ని వివరిస్తున్న షిప్‌యార్డ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో గురువారం పరిశ్రమ భద్రతలో భాగంగా ప్రథమ చికిత్సపై కార్మికులకు, ట్రైనీలకు అవగాహనతో కూడిన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. షిప్‌యార్డ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి పనిచేసే చోట ఎలాంటి భద్రత చర్యలు పాటించాలనే అంశాలను వివరించారు. ఒక వేళ పనిచేసేవారు అపస్మారక స్థితికి చేరుకుంటే దగ్గరలో ఉన్న వారు హార్ట్ రెస్పిరేటరీ ద్వారా ప్రథమ చికిత్స ఏ విధంగా అందించాలనేది తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు, ట్రైనీలు తదితరులు పాల్గొన్నారు.

పెదశేష వాహనంపై ఊరేగిన తిరుమలేశుడు



శ్రీవారి పెదశేష వాహన సేవలో పాల్గొన్న ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ దంపతులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి పెదశేష వాహన సేవను దివ్యక్షేత్రం మాడవీధుల్లో భక్త జనసందోహం మధ్య నిర్వహించారు. ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ దంపతులు పెదశేష వాహన సేవలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీవారి గరుడ వాహన సేవను నిర్వహించారు.

అబ్బురపరిచిన మాక్‌డ్రిల్

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులోకి బుధవారం రాత్రి ఒక్కసారిగా పోలీసులు నల్ల దుస్తులతో ప్రవేశించారు. దీంతో ఉద్యోగులంతా అవాక్కయ్యారు. వారి చేతుల్లో ఉన్న ఆయుధాలు చూసి భయపడిపోయారు. అనంతరం అది మాక్‌డ్రిల్ అని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. అదానీ గంగవరం పోర్టులో బుధవారం రాత్రి నిర్వహించిన మాక్‌డ్రిల్ అబ్బురపరిచింది. విశాఖపట్నం ఆక్టోపస్ అదనపు ఎస్పీ సి.రాజారెడ్డి ఆధ్వర్యంలో న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు, ఎస్ఐ శ్యామ్ సహకారంతో ముందుగా పోర్టులోని ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఉగ్రవాదుల దాడులను ఎలా ఎదుర్కోవాలనే అంశాన్ని వివరించారు. అనంతరం ఆయుధాలతో ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. న్యూపోర్టు పోలీసులు పాల్గొన్నారు.



మల్కాపురం పోలీస్‌స్టేషన్ నుంచి యారాడ వెళ్లే మార్గం ఇలా..



మల్కాపురం ప్రధాన రహదారిపై వీధి దీపాలు వెలగకపోవడంతో చీకటిమయమైన రోడ్లు

అలముకున్న అంధకారం

- గాడి తప్పిన వీధి దీపాల నిర్వహణ
- చీకటిలో ప్రమాదాల బారిన ప్రయాణికులు
- పారిశ్రామిక ప్రాంతంలో ప్రజల అవస్థలు

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో అంధకారం అలముకుంది. వీధి దీపాల నిర్వహణను అధికారులు గాలికి వదిలేయడంతో ప్రజలకు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. అసలే ఈ ప్రాంతంలో చైన్ స్నాచింగ్, దొంగల భయం, వీధి కుక్కల దాడులు, గంజాయి బ్యాచ్‌ల వీరంగం, మందుబాబుల అఘాయిత్యాలతో హడలిపోతున్న నేపథ్యంలో వీధిదీపాలు లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ..

కోరమాండల్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), షిప్‌యార్డ్, ఆంధ్రా పెట్రో కెమికల్స్ వంటి పరిశ్రమలు ఉన్న మల్కాపురం, సింధియా వంటి ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అక్కడి ప్రజలు, నేవీ సిబ్బంది, అటుగా ప్రయాణిస్తున్న వారు రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

వెలగని దీపాలు 80

గాజువాక నుంచి మల్కాపురం మీదుగా సింధియా వెళ్లే ప్రయాణికులు, 40, 61, 62, 63, వార్డుల ప్రజలు 6 గంటలు దాటితే చీకటిలో ప్రయాణాలు చేయలేక అత్యవసరమైనా వాయిదా వేసుకుంటున్నారు. మల్కాపురం, సింధియా, క్రాంతినగర్, త్రినాథపురం, దుర్గానగర్, ప్రకాష్‌నగర్ వంటి ప్రాంతాల్లో సుమారు 80 వరకు వీధి దీపాలు పనిచేయడం లేదని, ఏడాదిగా ఇదే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

తరచూ ప్రమాదాలు

జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ నుంచి ఇటు మల్కాపురం పోలీస్‌స్టేషన్, అటు యారాడ మార్గాల వైపు వెళ్లాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. ఒక్క క్రాంతినగర్‌లోనే కాకుండా సింధియా నుంచి మల్కాపురం వరకు ఉన్న ప్రధాన రహదారిలో సైతం వీధిలైట్లు వెలగక నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు టార్చిలైట్లు వేసుకుని ప్రయాణిస్తున్నారు. చీకటిలో విష కీటకాలు, పాములు సంచరిస్తాయనే భయంతో పాదచారులు పరుగులు తీస్తూ గుంతల్లో పడి ప్రమాదాలపాలవుతున్నారు. వీధిదీపాలు లేకపోవడంతో దొంగతనాలు కూడా అధికంగా జరుగుతున్నాయని చిరు వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ప్రజలు ఇంత ఇబ్బంది పడుతున్నా, ఫిర్యాదులిస్తున్నా పట్టించుకునేవారే లేకపోయారని విచారం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల అండతో రోడ్లపైనే వ్యాపారాలు



రోడ్డు పక్కన పార్క్ చేసిన ఇటుక, ఇసుక, పిక్క లారీలు

వార్డులో భవన నిర్మాణ సామగ్రిని విక్రయించే వ్యాపారులు అధికారుల అండదండలతో రెచ్చిపోతున్నారు. ఇసుక, పిక్క, ఇటుక వంటి మెటీరియల్‌ను రోడ్డు పైనే డంప్ చేసుకుని వ్యాపారం కొనసాగిస్తున్నారు. వ్యాపారులను అడ్డుకోవాల్సిన జీవీఎంసీ అధికారులు వాళ్లకి అండగా ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనాల వేగ నియంత్రణకు ఉపయోగించే స్టాపర్లను కూడా వ్యాపారాలకు వాడుకుంటున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. యారాడ మలుపు వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. దీంతో కొండ కిందికి దిగే ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చీకటిలో ప్రయాణం కష్టమవుతోంది



మల్కాపురం నుంచి సింధియా వరకు ప్రధాన మార్గంలో వీధి దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నాం. చీకటి వల్ల రోడ్డుపై గుంతలు కనిపించక ప్రమాదాలు కూడా ఎక్కువ జరుగుతున్నాయి. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలి.

– సూరాడ పెంటారావు, స్థానికుడు

వీధి దీపాలు నిత్యం వెలిగేలా చూడాలి



వార్డులో వీధి దీపాలు లేక రాత్రివేళల్లో బయటికి రావాలంటేనే భయంగా ఉంటోంది. చాలాసార్లు విద్యుత్ అధికారులకు తెలియజేశాం. కానీ ప్రయోజనం లేకపోయింది. అధికారులు మా బాధను అర్థం చేసుకుని, వీధిదీపాలు నిత్యం వెలిగేలా చర్యలు చేపట్టాలి.

– రవి, కాకరలోవ

భగ్గుమన్న భానుడు

వేడి, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి



ఎండ నుంచి రక్షణకు గొడుగే ఆధారం



ఎండ వేడికి తట్టుకోలేక తలపై టవల్ వేసుకుని ప్రయాణిస్తున్న వ్యక్తి

మల్కాపురం : నాలుగు రోజులుగా ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉండడంతో జనం అల్లాడిపోతున్నారు. ఎండ వేడికి తట్టుకోలేక మధ్యాహ్న సమయంలో ఇళ్లకే పరిమితమవుతున్నారు. అత్యవసరం అయితే తప్ప బయటికి వెళ్లడం లేదు. పాదచారులు గొడుగు నీడన వెళ్తున్నారు. బయటికి వచ్చిన వారు వేడిని భరించలేక చెట్టు నీడ లేదా ఏసీ రెస్టారెంట్లు, మాల్స్ వైపు పరుగులు తీస్తున్నారు. ఒకవైపు సెగలు, మరోవైపు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాత్రి సమయాల్లో కూడా గాలి వీయకపోవడంతో విలవిల్లాడుతున్నారు. ఇంకెన్ని రోజులు ఈ ఎండలు దేవుడా అని నిట్టూరుస్తున్నారు.

నాణ్యమైన కూరగాయలు అందించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఎంసీ వైస్ చైర్మన్ చందు

విశాఖ విద్య: రైతు బజార్‌లో వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు విక్రయించాలని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ వెంకుమహంతి చంద్రశేఖర్ (చందు) సూచించారు. 52వ వార్డు మద్రిపాలెం వుడా లేఅవుట్‌లోని రైతు బజార్‌ను డైరెక్టర్లు ఎలమంచిలి లలిత కుమారి, తమ్మినేని పద్మజతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. మార్కెట్లో రైతులు, హోల్‌సేల్ వ్యాపారులు, వినియోగదారుల సమస్యలపై ఆరా తీశారు. రైతు బజార్లో కల్పిస్తున్న సౌకర్యాలపై రైతుబజార్ ఎస్టేట్ అధికారి నారాయణరావును అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన కూరగాయలను వినియోగదారులకు నిర్దేశించిన ధరలకే విక్రయించేలా చూడాలన్నారు. రైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వై.తిరుమల రావు, బలభద్ర రాజు, శ్రీనివాసరెడ్డి, పి.టి.నాయుడు, రైతుబజార్ సహాయకుడు ప్రతాప్ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగంతోనే అందరికీ సమానత్వ హక్కు



స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ జీఎం రమణారావును సత్కరిస్తున్న డీసీపీ సత్తిబాబు, నాయకులు

ఉక్కునగరం: దేశంలో హక్కులు నిరాకరించబడిన సమాజంలో మొట్టమొదటి సారిగా సమానత్వ హక్కుల కల్పనకు మొట్టమొదటి లీగల్ డాక్యుమెంట్ భారత రాజ్యాంగం అని నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ (డీసీపీ) మోకా సత్తిబాబు అన్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన స్టీల్‌ప్లాంట్ ఎస్టీఎం విభాగం జీఎం ఎస్. రమణారావుకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సన్మాన గ్రహీత రమణారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన యాజమాన్యం, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ అంబేడ్కరీయులు బూలా జగ్జీవన్‌రామ్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఆర్. సత్యనారాయణ, జి. బోసుబాబు, ఠాగూర్, కె. రవిశేఖర్, కె. సంజీవరావు, డి. వసంతరావు, డి. ఆదినారాయణ, జె. అయోధ్యరామ్, మాటూరి శ్రీనివాసరావు, ఎల్.వి. రమణారావు, పెద్దిరాజు, బత్తుల శ్రీనివాసరావు, కె.ఎల్ నరసింహం, జి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబం చెంతకు..



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న మమత

విశాఖ విద్య: మానసిక స్థితి సరిగ్గా లేక, ఇంటి నుంచి తప్పిపోయి వచ్చిన వ్యక్తిని ఎట్టకేలకు వారి కుటుంబం చెంతకు చేర్చారు. వివరాలివి.. కొన్ని రోజుల క్రితం కంచరపాలెం ఫుట్‌పాత్ మీద బట్టలు లేకుండా, మానసిక పరిస్థితి బాగాలేక తిరుగుతున్న వ్యక్తిని స్థానికుల సమాచారంతో జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని జీవీఎంసీ షెల్టర్‌కు తరలించారు. అతని ఆరోగ్యపరిస్థితి సరిగా లేనందున, కంచరపాలెం పోలీసుల సమక్షంలో స్థానిక మెంటల్ కేర్ హాస్పిటల్‌లో చికిత్స చేయించారు. తన పేరు దేవేంద్ర అని, తనది తెలంగాణలో వేములవాడ గ్రామం అని చెప్పడంతో షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత వేములవాడలో తనకు తెలిసిన వారికి దేవేంద్ర విషయం తెలిపారు. దేవేంద్ర ఫొటోను వాట్సాప్ ద్వారా పంపించడంతో వారి కుటుంబసభ్యులు గుర్తించి, విశాఖపట్నం వచ్చారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ సహాయంతో దేవేంద్రను గురువారం మెంటల్ కేర్ హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేయించి అతని తల్లికి అప్పగించడంలో షెల్టర్ మేనేజర్ మమత ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తప్పిపోయిన తమ కుమారుడిని చెంతకు చేర్చినందుకు వారు మమతకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రం



స్టేషన్ ప్రాంగణంలో తుప్పు పట్టిన వాహనాలు, పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

మల్కాపురం: మల్కాపురం పోలీస్ స్టేషన్ వెనుక, పోలీస్ క్వార్టర్స్‌కు వెళ్లే మార్గాన్ని పోలీసులు శుభ్రం చేశారు. ఈ ప్రాంతం నిన్నటి వరకు తుప్పు పట్టిన వాహనాలు, పిచ్చి మొక్కలతో నిండి ఉండేది. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు ఆదేశాలతో స్టేషన్ సిబ్బంది, అధికారులు కలిసి గురువారం ఉదయం స్టేషన్ ప్రాంగణ ప్రదేశాలను పరిశుభ్రం చేశారు. సుమారు 9 గంటల పాటు పోలీసులు, అధికారులు, ఇతర సిబ్బంది శ్రమించి స్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. తుప్పు పట్టిన వాహనాలను ఒక ప్రత్యేక స్థలంలో పెట్టి, పోలీస్ క్వార్టర్స్‌కు వెళ్లే మార్గాన్ని అద్దంలా మార్చేశారు.

'రజనీ కల్యాణం' చిత్ర యూనిట్ సందడి



ముత్యాలమ్మ గుడిలో క్లాప్ కొడుతున్న యూనిట్

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు చినగొల్లలపాలెం ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద వారాహి క్రియేషన్స్ యూనిట్ గురువారం సందడి చేసింది. గ్రామీణ నేపథ్యంలో రజనీకల్యాణ్ పల్ల దర్శకత్వంలో రూపుదిద్దుకోనున్న రజనీ కళ్యాణం చిత్ర షూటింగ్‌ను దర్శకుడు తన తల్లిదండ్రులతో పాటు సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ చేతుల మీదుగా అమ్మవారి సన్నిధిలో క్లాప్ కొట్టి, ప్రారంభించారు. దర్శకుడు రజనీకల్యాణ్ మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో, రాజుల పరిపాలన, అప్పటి ప్రజల పరిస్థితిని ఇతివృత్తంగా తీసుకుని చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. సబ్బవరం పరిసర ప్రాంతాల్లోని కళాకారులకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్ల తాతారావు మాట్లాడుతూ దర్శకుడు కల్యాణ్ ఇక్కడి రైతు కుటుంబంలో జన్మించినా, సినీ పరిశ్రమపై మక్కువతో ఇక్కడి వరకు వచ్చారని తెలిపారు. పల్ల సత్యనారాయణ, పల్ల అప్పలనాయుడు నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నటీనటులు గెద్దం రమణ, శర్వాణి, సుస్మిత, కెమెరామన్‌గా రమణ పని చేస్తున్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులను ఆపాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కార్మిక, చేనేత, నైపుణ్యాభివృద్ధి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. గురువారం నాయకులు హైదరాబాద్‌లో స్టాండింగ్ కమిటీ నాయకులను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్ ప్లాంట్‌లో ఈ ఏడాది మార్చి నుంచి మే వరకు 3 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారన్నారు. దీనిపై స్టాండింగ్ కమిటీ సభ్యులు స్పందించి త్వరలో ఢిల్లీలో ఈ అంశంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు కలిసిన నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్లు సీహెచ్ నర్సింగరావు, డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కాంట్రాక్ట్ లేబర్ నాయకులు నమ్మి రమణ, శ్యామ్ పాల్గొన్నారు.

పచ్చని చెట్టు.. ప్రగతికి మెట్టు



వాకర్స్ సభ్యులతో కలసి ప్రతిజ్ఞ చేస్తున్న శ్రీధర్



60వ వార్డు గుల్లలపాలెం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పి.వి.సురేష్

మల్కాపురం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. జీవీఎంసీ 60వ వార్డు, గుల్లలపాలెంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ పి.వి.సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించం, మొక్కను పెంచే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తాం, పర్యావరణ పరిరక్షణకు అంతా పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ములగాడ మండల బీజేపీ అధ్యక్షుడు సతీష్, సీవో మహదేవి పాల్గొన్నారు. 58వ వార్డు, శ్రీహరిపురంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కోరాడ శ్రీను, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పోతబత్తుల శ్రీను తదితరులు మొక్కలు నాటారు. 59వ వార్డు, ములగాడ హౌసింగ్ కాలనీలో నాయకులు పుర్రె సురేష్ యాదవ్, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు.

ఈఎస్ఐ ఆవరణలో

సింధియా: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 40వ వార్డు పరిధి గాంధీగ్రామ్‌లో గల కార్మిక బీమా ఆసుపత్రి(ఈఎస్ఐ) ఆవరణలో సివిల్ సర్జన్ డాక్టర్ అప్రతిహత, హెడ్ నర్స్ లక్ష్మి మొక్కలు నాటారు. బీజేపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి ములకలపల్లి ప్రకాష్, మల్కాపురం మండలాధ్యక్షుడు మెరువా అనిల్‌కుమార్ పాల్గొని వైద్య సిబ్బందికి పైనాపిల్ మొక్కలను పంపిణీ చేశారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

విశాఖ విద్య: మానవవాళి మనుగడ కోసం పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వుడా లే అవుట్ ప్రాంతంలో హెల్దీ వాకర్స్ పార్క్ గ్రీన్‌బెల్ట్‌లో గురువారం పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. నగర పరిధిలో పరిశుభ్రతకు తమ వంతు భాగస్వామ్యం అందిస్తామని వార్డు పారిశుధ్య విభాగం సభ్యులు, హెల్దీ వాకర్స్ సభ్యులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని ప్రజలను కోరారు. ప్లాస్టిక్ కవర్లు కాకుండా వస్త్ర సంచులను వాడాలని, విరివిగా చెట్లు నాటాలని పిలుపునిచ్చారు. వాకర్స్ క్లబ్ సభ్యులతో కలసి పర్యావరణంపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు.

యోగాంధ్రపై చిత్రలేఖన పోటీ



చిత్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ సమావేశ మందిరంలో యోగాపై చిత్రలేఖన పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీలను మూడు విభాగాలుగా 10–18 ఏళ్లు, 19–35, ఆ పైబడిన వయస్సుల వారికి కేటగిరీలు వారీగా జరిపారు. పోటీల్లో అధికంగా 10–18 ఏళ్ల మధ్య వయస్కులే పాల్గొన్నారు. విజేతలకు ఎంపీడీవో పద్మజ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఎంఈవో రవీంద్రబాబు, ఈవోపీఆర్డీ చైతన్య, ఈపీడీసీఎల్ ఏఈ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఒకరి రక్తదానం ఇద్దరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) రక్తదాన శిబిరం నిర్వహించింది. గురువారం ఆటోనగర్ ఐలా సహకారంతో శిబిరం నిర్వహించారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ ఒకరి రక్తదానం ఇద్దరి ప్రాణాలను కాపాడుతుందన్నారు. 40 మంది వరకు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వాసీవా కార్యదర్శి రాంప్రసాద్, ఐలా వైఎస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఎంఎస్ఎంఈ ఏడీలు చంద్రమౌళి, బి.ప్రభాకర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.